క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సుడిగాలి పర్యటన చేశారు. ఆదివారం మండల పరిధిలోని మల్కారం, ఆర్లపెంట, అంకపాలెం, సుధాపల్లి, పార్కలగండి గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే పలు శుభ, దైవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంకంపాలెం గ్రామంలో సమ్మక్క, సారక్క అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పర్యటనలో సామాన్య ప్రజానీకంతో కలసిపోయిన ఎమ్మెల్యే, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, గుత్తా రాజా, కొయ్యల అచ్యుతరావు, స్థానిక సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ విజయోత్సవం

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యుత్ విజయోత్సవ కార్యక్రమం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న శ్రీ వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో, మణుగూరు మండలంలోని గుట్టమల్లారం వద్ద ఉన్న హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు డివిజనల్ అధికారి కె.జీవన్ కుమార్ తెలిపారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, వినియోగదారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(సోమవారం) విద్యుత్ విజయోత్స దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. స్థానిక గిరిజన భవన్‌లో నియోజకవర్గ స్థాయి విద్యుత్ విజయోత్సవ దినోత్సవ కార్యక్రమానికి అంతా సిద్ధం చేశామని, ఈ కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కూడా హాజరు అవుతారని తెలిపారు.

6న సర్వసభ్య సమావేశం

చర్ల: ఈ నెల 6న దుమ్ముగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ముత్యాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖలకు చెందిన ప్రధాన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రైల్వేశాఖ నిర్లక్ష్యమే కారణం

మణుగూరురూరల్: ఒడిశా రాష్ట్రంలో కోరమాండల్ రైలు ప్రమాదం రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే జరిగిందని, ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైలు ప్రమాదంలో సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోగా.. వెయ్యి మంది క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌లలో సౌకర్యాల కోసం కోట్లు ఖర్చు పెడుతున్న కేంద్రం.. రైల్వే లైన్‌లో సిగ్నల్ వ్యవస్థ, ట్రాకులను ఆధునీకరణ చేపట్టకపోవడం శోచనీయమన్నారు. తొలుత రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ..వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సమావేశంలో నాయకులు సత్రపల్లి సాంబశివరావు, నరసింహారావు, బొల్లం రాజు, లెనిన్‌బాబు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

చంద్రుగొండ: ఒడిశా రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి చంద్రుగొండలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారికి రూ.50 లక్షలు, గాయాలపాలైనవారికి రూ.10 లక్షలు అందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ జరపాలని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాయి రాజా, ఆర్.వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, పెద్దిని వేణు, బి.నాగేశ్వరరావు, అబ్దుల్ రహిమాన్, ఎస్‌కె.నాగుల్‌మీరా, పవన్‌కల్యాణ్, మంగయ్య, నర్సింహారావు, రాజా, కొండ, వంశి పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో చండీ హోమం జరిపించారు. ఆదివారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అర్చనలు, గోత్రనామార్చనాలు, మహానివేదన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోని హోమశాలలో అర్చకులు సత్యనారాయణశర్మ, సాయిలు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కూలీల కొరత.. కర్షకుల వ్యథ

- ‘ఉపాధి హామీ’కే కూలీల మొగ్గు
- తూనికాకు సేకరణలో వలసదారులు
- వ్యవసాయ పనులపై నీలినీడలు
- తోటలోనే రాలుతున్న మిర్చి



తోటలోనే ఎండిపోతున్న మిర్చి కాయలు..

దుమ్ముగూడెం: గోదావరి వరదలతో మిర్చి పంట ఆలస్యంగా సాగు చేసిన రైతులు.. మిరప పండ్లను కోసేందుకు అల్లాడుతున్నారు. కూలీల కొరతతో తోటల్లోనే పండ్లు రాలిపోతున్న పరిస్థితి రైతులకు ఎదురవుతోంది.

మండలంలో ఈ ఏడాది మిర్చి అధికంగా సాగు చేశారు. 885 మంది రైతులు 1150 ఎకరాలలో మిరపపంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. గతేడాది పలుమార్లు సంభవించిన గోదావరి వరదలతో పల్లపు చేలన్నీ వరద నీట మునగడంతో మిరప నాట్లు ఆలస్యంగా వేశారు. ఒకేసారి ఎక్కువ మంది రైతులు కోతలు చేపట్టడంతో కూలీలు దొరకడం లేదు.

ఉపాధి పనులపై అధికారుల ఫోకస్..

ఇదే సమయంలో ఉపాధిహామీ పథకం పనులకు రావాలంటూ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఉపాధి హామీ పనులకు కూలీలు తగ్గడంతో జిల్లా అధికారులు మండల అధికారులను కూలీలు తగ్గడానికి గల కారణాలు అడుగుతూ నెలవారీ లక్ష్యాలను నిర్ణయించారు. ఆ మేరకు పనులను చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఉపాధి సిబ్బంది కూలీల ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న కొద్దోగొప్పో కూలీలు ఉపాధి హామీ పనలకే మొగ్గు చూపుతున్నారు.

తునికాకు సేకరణలో ఛత్తీస్‌గఢ్ వాసులు

ఈ ఏడాది మిరప పంటను సాగు చేసిన రైతుల సంఖ్య పెరగడం కూలీల కొరత కనిపిస్తోంది. ఈ పనులకు ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చే కూలీలు కూడా దొరకడం లేదు. వారిలో అధికశాతం మంది తునికాకు సేకరణకు వెళ్లండడమే ఇందుకు కారణం. దీంతో మిరప పండ్ల సేకరణలో జాప్యం ఏర్పడుతోంది. గత వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కోతలు సరిగా సాగడం లేదు. ఇప్పుడేమో కూలీల కొరత. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే నేల రాలుతున్నా ఏం చేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

అక్కరకు రాని అధిక ధర..

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మిర్చికి ఆశాజనకమైన ధర ఉంది. మిర్చి క్వింటా రూ.25 వేలకు పైగా ధర లభించి ప్రస్తుతం కూడా రూ.20వేలకు దగ్గర ఉంది. అయినప్పటికీ చేలల్లోని పంటను కోసేందుకు కూలీలు దొరకనప్పుడు ధర పెరిగినా ఏం లాభం.

టార్కెట్ జూన్..

ఇప్పటికే మిర్చి మొత్తం చెట్లమీదే ఎండుముఖం పడుతోంది. మరికొన్ని చోట్ల పంట నేలరాలి రైతులను తీవ్ర ఆందోళనలో నెట్టింది. మిగిలిన పంటైన జూన్ మొదటి వారంలోగా పూర్తి కావాల్సి ఉంటుంది. ఈ మధ్యలో వర్షం పడిన కోతలు సమయం దాటినా రైతులకు మిగిలేది శున్యం.

‘ఉపాధి’కి విరామం ఇవ్వాలి



మిర్చి కోతల సమయంలో వర్షాలు పడటంతో కోతలు వెనకబడ్డాయి. ఇప్పుడు కోతల సమయంలో ప్రభుత్వం ఉపాధిహామీ పనులను చేపట్టడంతో కూలీలంతా ఆ పనులకు వెళ్తున్నారు. దీంతో లక్షల పెట్టుబడి పెట్టిన మిర్చి పంట నెలరాలిపోతోంది. అధికారులు ఒక పది రోజుల పాటు ఉపాధి హామీ పనులకు విరామం ఇస్తే మిర్చి కోతలు పూర్తవుతాయి. రైతుల పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవాలి.

– రావులపల్లి పృథ్వీ, రైతు, నర్సాపురం

ఏరువాక సాగారో.. అన్నో చిన్నన్న..



పత్తిగింజలు వేసేందుకు సాళ్లు తోలుతున్న రైతు



చర్ల: నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: ఏరువాక పౌర్ణమి రోజున పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రైతులు వానాకాలం పంటల సాగు పనులు ప్రారంభించారు. లక్ష్మీపురం, నాగినేనిప్రోలు, టేకులచెరువు గ్రామాలలో కొందరు రైతులు పత్తి విత్తనాలు వేశారు. కొందరు రైతులు వరినార్లు పోసుకునేందుకు మడులను సిద్ధం చేశారు. పచ్చిరొట్ట ఎరువుగా మాగాణి భూములలో కొందరు రైతులు జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు చల్లుకున్నారు.


చర్ల: దుమ్ముగూడెం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం శ్రీ నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో రైతులకు విజయ తిలకం దిద్ది, శాలువాలు కప్పి సత్కరించారు. కాడెడ్లకు పూజలు నిర్వహించి ఏరువాక సాగారు. ఈ కార్యక్రమంలో యువ రైతులు యలమంచి వంశీకృష్ణ, సంస్థ సభ్యులు శివ, పురుషోత్తం, గుప్త, సతీష్, అనన్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రంగనాయకుల గుట్ట ఎస్‌ఆర్‌ఎస్‌పీ స్కూల్‌లో 1984–85 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి దివంగత ఉపాధ్యాయులు, విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. 38 సంవత్సరాలు తరువాత ఇలా ఒకరినొకరు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి మెమెంటోలు, గిఫ్టలను పంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇటూరి నాగేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, తాండ్ర నరసింహారావు, రవికుమార్, పురుషోత్తమాచార్యులు, శ్రీను, వేణుమాధవరాజు, నాగేశ్వరరావు, రమణ, శ్రీదేవి, పద్మజ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

రహదారిపైనే పార్కింగ్



మండల కేంద్రంలో రహదారి పక్కనే వాహనాలను నిలపడం వల్ల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో సాయంత్ర సమయాల్లో ప్రధాన సెంటర్‌లో రద్దీగా ఉండటంతో వాహనదారులు రహదారి పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారిపై ప్రయాణించే భారీ వాహనాలకు, ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: షాహీన, ఎస్సై, అన్నపురెడ్డిపల్లి
ఫోన్ నంబర్: 9440904244

ముమ్మరంగా తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగిన వారపు సంతకు సరిహద్దు ప్రాంతంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలిరాగా వారి మాటున మావోయిస్టులు, మిలీసియా సభ్యులు, కొరియర్లు, సానుబూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లక్ష్మీకాలనీ, లెనిన్ కాలనీ, అంబేడ్కర్ నగర్, పాతచర్ల, గాంధీ సెంటర్, కలివేరు క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాలలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు.

చల్లబడిన వాతావరణం

బూర్గంపాడు: ఆదివారం ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు సూర్యుడు ప్రతాపాన్ని చూపించాడు. జనాలు ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడ్డారు. ఎండతీవ్రతకు విలవిలలాడిపోయారు. కానీ సాయంత్రం ఆరుగంటలకు ఒక్కసారి వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో గాలివాన మొదలైంది. సుమారు అరగంటపాటు మండల వ్యాప్తంగా వానపడింది. దీంతో వాతావరణం చల్లబడింది.

ఉత్సవాలను విజయవంతం చేయండి



జీఎం రామచంద్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో నేడు (సోమవారం) జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ కోరారు. ఆదివారం ఏరియా జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆవిర్భావ దశాబ్ది ఉత్సావాలు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతాయన్నారు. జాతీయ పతాకావిష్కరణ, జీఎం ఆఫీస్ నుంచి భద్రాద్రి స్టేడియం వరకు సింగరేణి ప్రగతి రన్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ప్రముఖ ఉద్యమ గాయకురాలు స్వర్ణక్క బృందంచేత తెలంగాణ సంస్కృతిపై జానపద గీతాలాపన, కళానృత్యాలు, స్థానిక కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానాలు, విజేతలకు బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావులు ముఖ్య అతిథులుగా హాజరౌతున్నట్లు వెల్లడించారు. అనంతరం పాల్గొన్న వారందరికీ భోజన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి సీఈఆర్, ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి సౌజన్యంతో జానపద గాయకుడు గిద్దె రామనర్సయ్య, రాజేందర్ బృందంతో తెలంగాణ ధూంధాం కార్యక్రమాలు, క్లాసికల్ కొరియోగ్రాఫర్ సీతా ప్రసాద్ బృందంతో శాస్త్రీయ నృత్యాలు, మిమిక్రి రవి ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలకు సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు, పురజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



ఏరియా ఉత్తమ ఉద్యోగులు, అధికారులు వీరే..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు–2023 పురస్కరించుకుని మణుగూరు ఏరియా నుంచి అత్యుత్తమ ఉద్యోగి, ఉత్తమ అధికారులు, ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా డిజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ ఆదివారం తెలిపారు. ఏరియా అత్యుత్తమ ఉద్యోగిగా పీకేఓసీ ఈపీ ఆపరేటర్ డి.కార్తీక్, ఉత్తమ అధికారులుగా పీకే ఓసీ ఎస్ఈ(ఈఅండ్ఎం) డి.శ్రీనివాసరావు, మణగూరు ఓసీ డివైఎస్ఈ (ఈఅండ్ఎం) ఫల్గుణాచారిలు, ఉత్తమ ఉద్యోగులుగా ఈపీ ఆపరేటర్ కెఎ.ముత్తప్ప, సెక్యూరిటి గార్డ్ బి.జయరాజ్, ఫిట్టర్ పి.శ్యామ్ ప్రసాద్‌లు ఎంపికయ్యారని తెలిపారు. అత్యుత్తమ ఉద్యోగి కార్తీక్‌ను కార్పొరేట్ (కొత్తగూడెం)లో సన్మానించనున్నట్లు తెలిపారు. ఏరియా ఉత్తమ అధికారులను, ఉద్యోగులను ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరుకానున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ల చేతుల మీదుగా సన్మానించనున్నట్లు తెలిపారు.

మోడు సంకల్పం..!



ఉన్నత పాఠశాలలో ఎండిపోయిన కాండానికి చిగురించిన కొమ్మలు



కొర్సగూడెంలో ఎండిపోయిన చెట్టుకు కొమ్మలు..

అశ్వారావుపేటరూరల్: పచ్చని చెట్లను కొంతమంది స్వార్థం కోసం నరికివేస్తుంటారు. అవి మోడుబారుతుంటాయి. అయినా సరే వాటిలో కొన్ని తిరిగి చిగురుస్తుంటాయి. దీనికి ఈ ఫొటోల్లో కనిపిస్తున్న దృశ్యాలే నిదర్శనం.

అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఆవరణలో కిచెన్ షెడ్డు సమీపంలో, ప్రహరి నిర్మాణానికి అడ్డుగా ఉందని ఏడాది క్రితం ఓ నేరేడు చెట్టును నరికేశారు. దీని కాండం సైతం పూర్తిగా ఎండిపోయింది. అయినా సరే ఎండిపోయిన కాండానికి తిరిగి కొమ్మలు చిగురుస్తున్నాయి. అలాగే మండలంలోని కొర్స గూడెం గ్రామం నుంచి సున్నంబట్టి వెళ్లే మార్గంలో రెండేళ్ల క్రితం ఓ తురాయి చెట్టు గాలి దుమారానికి నేలమట్టమైంది. ఈ చెట్టు పూర్తిగా ఎండిపోగా, కాండం మధ్యలో లేత చిగురు కొమ్మలు ఏపుగా పెరుగుతున్నాయి. ఈ దృశ్యాలను ‘సాక్షి’ కెమెరాలో క్లిక్ అనిపించింది.

కనీస వేతనాల అమలుకు కృషి

బూర్గంపాడు: మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలను అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కనీస వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికులు సమ్మె నోటీస్ అందించిన నేపథ్యంలో ఆదివారం మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద కార్మికులతో సమావేశమై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తెలుసుకున్న ఆయన.. ప్రభుత్వంతో చర్చించి వేతనాల పెంపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

ప్రగతిపథంలో ములకలపల్లి

- రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- వివిధ శాఖల పరిధిలో నిర్మాణాలు



సూరంపాలెం శివారులో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు (ఫైల్)

ములకలపల్లి: ఎన్నోఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు కావడంతో పనులు మొదలయ్యాయి. ఆరు నెలల వ్యవధిలో సుమరు 30 కోట్ల రూపాయల మంజూరుకాగా పనులు పరుగులు పెడుతుండతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో..

పంచాయతీరాజ్ (పీఆర్) శాఖ విభాగంలో రూ.5.20 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అదనపు గది నిర్మాణానికి 1.5 కోట్ల రూపాయలు మంజూరుకాగా, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశరరావు భూమిపూజ చేశారు. కాగా నిర్మాణ పనులు చురుగ్గా సాగున్నాయి. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనానికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇటీవలే సుమారు రెండు కోట్లు మంజూరు కావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.3.7కోట్ల సీసీ రోడ్లు మంజూరుకాగా, ఇప్పటికే రూ.3.4 కోట్ల పనులు పూర్తయ్యాయి. పీఆర్ఏఈ శివలాల్ ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో..

రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ)లో 16.12 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. కమలాపురం శివారులోని గాడెపువాగుతోపాటు, గ్రామ శివారులోని వాగులపై మూడు వంతెనల నిర్మాణాలను రూ.4.2 కోట్ల నిధులు వచ్చాయి, ఇటీవలే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమిపూజ చేసి, పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఆయా పనులు నిర్మాణదశలో ఉన్నాయి. మండల పరిధిలోని పొగళ్లపల్లి నుంచి తిమ్మంపేట వరకు 9.1 కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి 4.32 కోట్లు మంజూరుకాగా, పనులు ఆరంభించారు. ఇక తాళ్లపాయ వద్ద కోతకు గురైన బిటీరోడ్లుకు ప్రొటెక్టివ్ వాల్ నిర్మాణానికి 1.8 కోట్లు విడుదలకాగా పనులు మొదలయ్యాయి. మండలవాసులు చిరకాల స్వప్నం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. దీని నిర్మాణానికి రూ 5.75 నిధులు మంజూరుకాగా, టెండరు దశలో ఉంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు

ఎన్నోఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యానికి కోట్లాది రూపాయలు మంజూరయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. మంగలిగుట్ట నుంచి సుందరయ్యనగర్‌కు 1.80 కిమీ రోడ్డు నిర్మాణానికి రూ.1.06 కోట్లు, గడ్డం వారిగుంపు నుండి ఎర్రప్పగుంపు వరకూ 1.30 కిమీలకు రూ.46 లక్షలు, నర్సాపురం నుంచి తోగ్గూడెం వరకూ 4.80 కిమీలకు రూ.2.85 కోట్లు, రాజీవ్ నగర్ నుండి గుండాలపాడు వరకూ 9.30 కిమీ రూ.1.65 కోట్లు నిధులు విడుదలయ్యాయి. దీంతో ఆయా బీటీ రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఐటీడీఏ ఏఈ సుబ్బరాజు పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు. కాగా, నూతనంగా మరో 4 బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సూరంపాలెం నుంచి నల్లముడి వరకూ 1.30 కిలోమీటర్లకు 97.50 లక్షలు పాతగంగారం నుంచి వాగొడ్డుగుంపు వరకూ 1.60 కి.మీకి రూ.1.20 కోట్లు, నర్సాపురం నుండి చింతపేట వరకు 1.80 కిలోమీటరుకు రూ.1.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ పూర్తికాగానే పనులను ప్రారంభించనున్నారు.

మంగలిగుట్టలో నూతన సబ్‌స్టేషన్..

మంగలిగుట్ట వద్ద నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.1.50 కోట్ల రూపాయల నిధులు మంజూరుకాగా, టెండర్ టెండర్ దశలో ఉంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) ఆధ్వర్యంలో పనులను చేపట్టనున్నారు.